# ఇజ్రాయెల్ బహుముఖ యుద్ధం

- ఇప్పటికే హమాస్, హెజ్బొల్లాతో పోరు
- నేరుగా తలపడేందుకు సిద్ధమైన ఇరాన్
- యెమెన్ నుంచి దాడులు చేస్తున్న హౌతీలు
- ఇరాక్, సిరియా మిలీషియాలతో తలనొప్పి
- పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు అనేక సవాళ్లు




జెరూసలేం, అక్టోబర్ 3: సరిగ్గా ఏడాది క్రితం అక్టోబరు 7న అర్ధరాత్రి ఇజ్రాయెల్‌పై గాజా స్ట్రిప్ నుంచి హమాస్ విరుచుకుపడింది. రాకెట్ దాడులతో పాటు ఇజ్రాయెల్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి దాడి చేసి వందలాది మందిని హతమార్చింది. దీంతో హమాస్‌పై ఇజ్రాయెల్ కన్నెర్ర చేసి ప్రతిదాడికి దిగింది. ఏడాది క్రితం కేవలం హమాస్‌తో ప్రారంభమైన ఇజ్రాయెల్ పోరాటం అనేక శక్తులతో ఆరు వైపులా పోరాడాల్సిన స్థితిలోకి వెళ్లింది. దీంతో 2006 తర్వాత ఇప్పుడు మరోసారి ఇజ్రాయెల్ భారీ బహుముఖ యుద్ధాన్ని చేయాల్సి వస్తున్నది.

**గాజాలో హమాస్‌తో పోరాటం**

గాజాలో హమాస్‌ను పూర్తిస్థాయిలో తుడిచిపెట్టే దిశగా ఇజ్రాయెల్ ఏడాది నుంచి దాడులు చేస్తున్నది. హమాస్ స్థావరాలపై నిత్యం గగనతల దాడులు చేస్తున్నది. వేలాదిగా ఇజ్రాయెల్ బలగాలు గాజాలో భూతల దాడులు చేస్తున్నాయి. ఏడాదిగా జరుగుతున్న ఈ దాడుల్లో దాదాపు 50 వేల మంది మరణించినా ఇప్పటికీ ఒక పరిష్కారం దొరకడం లేదు. హమాస్ చేతిలో బందీలుగా ఉన్న తమ పౌరులను విడిపించుకునేందుకు ఇజ్రాయెల్ పోరాటం ఇంకా కొనసాగుతున్నది.

**హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకున్న ఇజ్రాయెల్**

హమాస్‌కు మద్దతుగా ఏడాది కాలంగా ఇజ్రాయెల్‌పై లెబనాన్ నుంచి హెజ్బొల్లా దాడులకు పాల్పడుతున్నది. ఈ నేపథ్యంలో గత నెల రోజులుగా హెజ్బొల్లాను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. హెజ్బొల్లా చీఫ్ నస్రల్లాను హతమార్చింది. ఒకవైపు గగనతల దాడులు చేస్తూనే లెబనాన్‌లోకి చొచ్చుకెళ్లి భూతల దాడులు ప్రారంభించింది. హెజ్బొల్లాకు సైతం వేల సంఖ్యలో సైనిక బలం ఉండటం, పెద్ద ఎత్తున ఆయుధాలు ఉండటంతో ఈ పోరాటం మరింత తీవ్రరూపం దాల్చనుంది.

**యెమెన్ నుంచి హౌతీల దాడులు**

యెమెన్‌లోని చాలా ప్రాంతాలను ఆధీనంలో ఉంచుకున్న హౌతీ తిరుగుబాటుదారులు సైతం ఇజ్రాయెల్‌ను శత్రువుగా ప్రకటించారు. హమాస్, హెజ్బొల్లాకు ఉన్నట్టుగానే హౌతీలకూ ఇరాన్ మద్దతు ఉంది. దీంతో తరచూ ఇజ్రాయెల్‌పై హౌతీలు డ్రోన్లతో దాడులు చేస్తున్నారు. ఇజ్రాయెల్‌కు దక్షిణ వైపు సరిహద్దుల్లో, జలమార్గాల్లో హౌతీలతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో హౌతీలపైనా ఇజ్రాయెల్ పోరాడుతున్నది.

**ఇరాక్, సిరియా నుంచి మిలీషియాలు..**

సిరియా, ఇరాక్ కేంద్రంగా పని చేస్తున్న మిలీషియాలు సైతం ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నాయి. వీటికి సైతం ఇరాన్ మద్దతు ఉందని, ఇరాన్ నుంచి ఆయుధాలు అందుతున్నాయని ఇజ్రాయెల్ ఆరోపిస్తున్నది. సిరియా నుంచి మిలీషియాలు ఇటీవల తరచూ ఇజ్రాయెల్‌పై డ్రోన్లతో దాడులు చేస్తున్నారు. ఇజ్రాయెల్ సైతం సిరియా రాజధాని డమాస్కస్‌లోని మిలీషియా కేంద్రాలపై దాడులు చేస్తున్నది.

**వెస్ట్‌బ్యాంక్‌లో మిలిటెంట్ల సమస్య**

ఇజ్రాయెల్ ఆధీనంలో ఉన్న వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో మిలిటెంట్లు చురుగ్గా ఉన్నారు. వీరికి ఇరాన్ మద్దతు ఉందని ఇజ్రాయెల్ ఆరోపిస్తున్నది. వెస్ట్‌బ్యాంక్‌లో మిలిటెంట్లు, ఇజ్రాయెల్ బలగాలు మధ్య తరచూ దాడులు జరుగుతుంటాయి. పాలస్తీనాతో పాటు ఇజ్రాయెలీలు నివసించే ఈ ప్రాంతంలో మిలిటెంట్లతో పోరాటం ఇజ్రాయెల్‌కు సమస్యాత్మకంగా మారింది.

**నేరుగా యుద్ధానికి ఇరాన్ సిద్ధం**

గత ఏడాదికాలంగా ఇజ్రాయెల్ వ్యతిరేక శక్తులకు పరోక్షంగా అండగా ఉంటున్న ఇరాన్ ఇప్పుడు నేరుగా రంగంలోకి దిగింది. ఇజ్రాయెల్‌పై ఒకేసారి 180 క్షిపణులతో విరుచుకుపడి యుద్ధానికి సిద్ధమని చెప్పకనే చెప్పింది. ఈ దాడితో ఇరాన్ చాలా పెద్ద తప్పు చేసిందని, ఇందుకు మూల్యం చెల్లించుకోవాల్సిందేనని ఇజ్రాయెల్ సైతం ప్రకటించింది. దీంతో ఇరు దేశాల మధ్య పోరు తీవ్రం కానుంది. మిగతా అన్ని మిలిటెంట్ సంస్థలతో పోరాటం ఒక సవాల్ అయితే, నేరుగా ఇరాన్‌తో పోరాటం ఇజ్రాయెల్‌కు పెద్ద సవాల్‌గా మారనుంది.

# హమాస్ ప్రభుత్వాధినేత హతం

- మరో ఇద్దరు కీలక నేతలు సైతం
- ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటన
- సెంట్రల్ బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి
- 9 మంది మృతి.. 14 మందికి గాయాలు
- టెల్ అవీవ్‌పై డ్రోన్లతో హౌతీల దాడి

జెరూసలేం, అక్టోబర్ 3: మూడు నెలల క్రితం జరిపిన ఓ దాడిలో గాజాస్ట్రిప్‌లో హమాస్ ప్రభుత్వాధినేత రౌహి ముష్తాహను హతమార్చినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ గురువారం ప్రకటించింది. ఇజ్రాయెల్ సెక్యూరిటీ ఏజెన్సీతో కలిసి ఈ దాడి చేశామని, ఇందులో రౌహితో పాటు హమాస్ పొలిటికల్ బ్యూరో భద్రత బాధ్యతలు చూసే సమేహ్ అల్ సిరాజ్, కమాండర్ సమీ ఔదేహ్‌ను హతమార్చినట్టు వెల్లడించింది. హమాస్ సీనియర్ నేతల్లో ముష్తాహ ఒకరని, హమాస్ ఉగ్రనేత యాహ్యా సిన్వర్‌కు కుడిభుజంగా అతడిని భావిస్తారని తెలిపింది. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి పాల్పడి, 1,205 మంది ఇజ్రాయెలీలను హతమార్చింది. అప్పటి నుంచి గాజాపై దాడులను ప్రారంభించిన ఇజ్రాయెల్ వేలాదిమంది హమాస్ మిలిటెంట్లతో పాటు కీలక నేతలను మట్టుబెట్టింది.



ఇజ్రాయెల్ దాడుల అనంతరం బీరుట్‌లోని ఓ ప్రాంతంలో వెలువడుతున్న పొగ



రౌహి ముష్తాహ

**లెబనాన్ పార్లమెంటు సమీపంలో దాడి**

లెబనాన్‌లోని సెంట్రల్ బీరుట్‌లో గురువారం తెల్లవారుజామున ఓ అపార్ట్‌మెంట్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. ప్రధానమంత్రి కార్యాలయం, పార్లమెంటు, ఐరాస కార్యాలయానికి కూతవేటు దూరంలోనే జరిగిన ఈ పేలుడులో తొమ్మిది మంది మరణించారు. మరో 14 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో హెజ్బొల్లా సభ్యులతో పాటు సాధారణ ప్రజలు, సహాయక చర్యల్లో ఉన్న వైద్య సిబ్బంది కూడా ఉన్నారు. బెల్జియంకు చెందిన ఇద్దరు జర్నలిస్టులకు ఈ ఘటనలో గాయాలయ్యాయి. కాగా, పేలుడు తర్వాత సల్ఫర్ లాంటి వాసన వచ్చినట్టు స్థానికులు పేర్కొన్నారు. దీంతో ఇజ్రాయెల్ ఫాస్ఫరస్ బాంబులను ఉపయోగిస్తున్నదని లెబనాన్ అధికారిక జాతీయ వార్తా సంస్థ ఆరోపించింది. బుధవారం దక్షిణ లెబనాన్‌లో హెజ్బొల్లా జరిపిన దాడిలో ఎనిమిది మంది ఇజ్రాయెల్ సైనికులు మరణించడంతో దాడుల తీవ్రతను ఇజ్రాయెల్ మరింత పెంచింది. కాగా, ఉత్తర ఇజ్రాయెల్‌లోని ఆ దేశ సైనికులు, సైనిక స్థావరాలే లక్ష్యంగా దాదాపు 20 క్షిపణులు, రాకెట్లతో దాడి చేసినట్టు హెజ్బొల్లా ప్రకటించింది. దక్షిణ లెబనాన్‌లో మరౌన్ అల్‌రౌస్‌లో ఇజ్రాయెల్ సైనికుల బృందంపై బాంబు దాడి చేశామని పేర్కొన్నది. ఈ దాడిలో ఇజ్రాయెల్ సైనికులు కొందరు మరణించారని తెలిపింది.

**టెల్ అవీవ్‌పై హౌతీల దాడి**

ఇజ్రాయెల్ ప్రధాన నగరం టెల్ అవీవ్‌పై యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు డ్రోన్లతో దాడి చేశారు. గురువారం ఉదయం టెల్ అవీవ్‌లోని తమ కీలక లక్ష్యాలపై డ్రోన్‌లతో దాడులు చేసినట్టు హౌతీలు ప్రకటించారు. తమ దాడి విజయవంతమైందని, డ్రోన్లు లక్ష్యాలను చేరుకున్నాయని పేర్కొన్నారు.

**కాల్పుల విరమణకు అంగీకరించిన వెంటనే నస్రల్లా హత్య**

ఇజ్రాయెల్ దాడిలో హెజ్బొల్లా చీఫ్ హస్సన్ నస్రల్లా మృతికి ముందు జరిగిన సంఘటనలపై లెబనాన్ విదేశాంగ మంత్రి అబ్దల్లా బౌ హబీబ్ కీలక విషయాలు వెల్లడించారు. కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ, హెజ్బొల్లా చీఫ్ నస్రల్లా అంగీకరించినట్టు చెప్పారు. నస్రల్లాను లెబనాన్ హౌజ్ స్పీకర్ నబిహ్ బెర్రీ సంప్రదించగా కాల్పుల విరమణకు ఆయన అంగీకరించారని తెలిపారు. నెతన్యాహూ సైతం 21 రోజుల కాల్పుల విరామణకు అంగీకరించారని అన్నారు. అయితే, నెతన్యాహూ మనసు మార్చుకొని పోరాటాన్ని కొనసాగించాలని బలగాలకు చెప్పారని, తర్వాత నస్రల్లాను హతమార్చారని తెలిపారు.

## ఇరాన్ హిట్ లిస్టులో నెతన్యాహూ

ఒకవైపు ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్నదనే వార్తల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూను ఇరాన్ తన హిట్‌లిస్టులో చేర్చిందని తెలుస్తున్నది. నెతన్యాహూతో పాటు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్, ఆ దేశ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల కమాండర్లు ఇరాన్ హిట్‌లిస్టులో ఉన్నారని పేర్కొంటూ ఒక పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ హిట్‌లిస్టుపై ఇజ్రాయెల్ స్పందించలేదు. అయితే, తమ లక్ష్యం నెతన్యాహూ కాకపోవచ్చని, ఇతర ఇజ్రాయెల్ సీనియర్ లీడర్లను లక్ష్యంగా చేసుకోవచ్చని ఇరాన్ మిలిటరీ ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొన్నాయి.

# హిమాచల్‌లో టాయ్‌లెట్ ట్యాక్స్

మొదటిపేజీ తరువాయి...

చేస్తాయి. కానీ, హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ సర్కారు మాత్రం తిరోగమన దిశలో వెళ్తున్నది. మరుగుదొడ్లు నిర్మించుకోవడమే ప్రజలు చేసిన తప్పు అన్నట్టుగా భారం మోపుతున్నది.

**టాయ్‌లెట్ల సంఖ్యను బట్టి ట్యాక్స్**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ హిమాచల్ ప్రదేశ్‌ను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. ఉద్యోగులకు సమయానికి వేతనాలు కూడా ఇవ్వలేని స్థితికి కాంగ్రెస్ సర్కారు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఆదాయం పెంచుకునేందుకు ఇంతవరకు వినని టాయ్‌లెట్ ట్యాక్స్‌ను ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. మరుగుదొడ్లపై పన్నులను వసూలు చేయాలని గురువారం అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ ప్రాంతాల్లో ఒక్కో టాయ్‌లెట్ సీటుకి నెలకు రూ.25 చొప్పున ప్రజల నుంచి వసూలు చేయాలని ఆదేశించింది. ఎన్ని టాయ్‌లెట్లు ఉంటే అన్నింటికీ ఈ పన్ను చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. ఇంతకుముందు ఇక్కడ నీటి బిల్లులు కూడా ఉండేవి కాదు. ఈ నెల నుంచే ప్రభుత్వం నెలకు రూ.100 చొప్పున నీటి బిల్లును అమలులోకి తీసుకొచ్చింది. ఇందులో రూ.30 సీవరేజి బిల్లు కాగా, మిగతాది నీటి వినియోగానికి విధిస్తుంది. హిమాచల్ ప్రదేశ్‌లో దాదాపు 10 లక్షల మంది ప్రజలు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరిపై ఈ కొత్త పన్నుల భారం పడనుంది.



## బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లతో టైప్-1 డయాబెటిస్

లండన్, అక్టోబర్ 3: బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లతో టైప్-1 డయాబెటిస్ వచ్చే అవకాశం ఉన్నదని యూకేలోని కార్డిఫ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. బ్యాక్టీరియాలోని కొన్ని ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థను దెబ్బతీస్తాయని.. కిల్లర్ టీ సెల్స్ తీవ్రంగా ప్రభావితం అవుతాయని వివరించారు. బ్యాక్టీరియా కణాలను చంపే క్రమంలో కిల్లర్ టీ సెల్స్ కొన్ని సందర్భాల్లో ఇన్సులిన్ ప్రొటీన్ ఉత్పత్తి చేసే కణాలను కూడా చంపుతాయని వెల్లడించారు.

## కులం ఆధారంగా పనులు కేటాయించొద్దు

**జైళ్లలో వివక్షపై సుప్రీం ఆగ్రహం**

న్యూఢిల్లీ: కుల వివక్ష కలిగిన సుమారు 11 రాష్ట్రాల జైళ్ల నియమావళులను సుప్రీంకోర్టు గురువారం పక్కన పెట్టింది. కులాల ఆధారంగా ఖైదీలకు ప్రత్యేక వార్డులు, పనులు కేటాయించే పద్ధతిని నిరాకరించింది. వివక్షను నిరోధించే బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని తెలిపింది. 'ఇలాంటి నిబంధనలు రాజ్యాంగ విరుద్ధం. రాష్ట్రాలు తమ జైళ్ల నియమావళుల్లో మార్పులు చేయాలి' అని ధర్మాసనం పేర్కొంది.

## స్పేస్ అంబాసిడర్‌గా తెలంగాణ యువకుడు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ స్పేస్ రిసెర్చ్ మిషన్‌కు తెలంగాణ యువకుడు ఇండియా అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. అంతర్జాతీయ స్పేస్ మిషన్ సంస్థ 'లూనార్స్ రిసెర్చ్ స్టేషన్'కు అంబాసిడర్ ఫర్ ఇండియాగా మోహనసాయి ఆకుల(అమర్) ఎంపికయ్యారు. వరల్డ్ స్పేస్ వీక్ అంతర్జాతీయ సదస్సులో సంస్థ తరపున ఇండియా ప్రతినిధిగా పాల్గొంటారు. ఆస్ట్రోబయాలజీ చివరి సంవత్సరం చదువుతున్న తనకు అంతర్జాతీయ స్పేస్ రిసెర్చ్ వేదికపై ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం అరుదైన గౌరవమని మోహనసాయి తెలిపారు.



## సంగీతంతో మొక్కల పెరుగుదల!

**ఆస్ట్రేలియా పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి**



సిడ్నీ, అక్టోబర్ 3: సంగీతానికి రాళ్లను కూడా కరిగించే శక్తి ఉంటుందని అంటారు. రాళ్లు కరుగుతాయో లేదో కానీ మొక్కలు మాత్రం వేగంగా పెరుగుతాయని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఒకే విధమైన సంగీతాన్ని వినిపించడం ద్వారా మొక్కల పెరుగుదలకు కారణమయ్యే ఫంగస్ పనితీరును ప్రోత్సహించవచ్చని తేలింది. ఆస్ట్రేలియాలోని ఫ్లిండర్స్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు జరిపిన ఈ అధ్యయనం వివరాలు 'బయాలజీ' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ట్రైకోడెర్మ హర్జియానమ్ అనే రకమైన ఫంగస్‌ను సేంద్రీయ వ్యవసాయంలో వినియోగిస్తారు. ఇది మొక్కలను వ్యాధుల నుంచి రక్షణ కల్పించడంతో పాటు మట్టిలో పోషకాలు పెంచి మొక్కల ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. అధ్యయనంలో భాగంగా ప్రతిరోజు అరగంట పాటు 80 డిసెబిల్స్‌లో ఒకేరకమైన సంగీతాన్ని వినిపించారు. ఐదురోజుల తర్వాత చూడగా నిశబ్దంలో ఉన్న ఫంగస్ కంటే సంగీతం వినిపించిన చోట ఉన్న ఫంగస్ ఎక్కువగా వృద్ధి చెందిందని పరిశోధకులు గుర్తించారు. తద్వారా మొక్కల ఎదుగుదలకు సంగీతం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో నకిలీ ఎస్బీఐ బ్రాంచ్

**ప్రజలకు లక్షల్లో టోకరా**

రాయ్‌పూర్, అక్టోబర్ 3: ఛత్తీస్‌గఢ్‌లో విస్తుపోయే బ్యాంకింగ్ మోసం వెలుగులోకి వచ్చింది. నేరగాళ్లు ఏకంగా ఓ నకిలీ ఎస్బీఐ బ్రాంచ్‌ను ఏర్పాటుచేసి, ప్రజలను నిండా ముంచారు. నకిలీ నియామకాలు, శిక్షణ కార్యక్రమాలతో నిరుద్యోగ యువతను సైతం మోసం చేశారు. రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌కు 250 కి.మీ దూరంలోని సక్తి జిల్లా ఛపోరా గ్రామంలో ఈ ఘటన జరిగింది. పది రోజుల క్రితం ప్రారంభమైన ఈ బ్రాంచ్‌లో అచ్చం అసలైన బ్యాంక్‌లో లాగానే కొత్త ఫర్నీచర్, బ్యాంక్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. నకిలీ శాఖ అని తెలియక గ్రామస్థులు ఇందులో ఖాతాలు తెరచి లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఎస్బీఐ దబ్రా బ్రాంచ్ మేనేజర్‌కు విషయం తెలిసి, గత నెల 27న ఈ బ్రాంచ్‌పై విచారణ చేయడంతో అసలు మోసం బయట పడింది. ఈ ఘరానా నేరంలో నలుగురిని నిందితులుగా గుర్తించారు. ఈ బ్రాంచ్‌లో ఉద్యోగం పొందినవారికి ఇచ్చిన ఆఫర్ లెటర్లు కూడా అచ్చం నిజమైన వాటిలాగే ఉన్నాయి. నకిలీ శాఖలో ఉద్యోగాలను రూ.2 నుంచి రూ.6 లక్షల ధరకు అమ్మినట్టు బాధితులు వాపోయారు.

## మ్యారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించలేం

**సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం**



న్యూఢిల్లీ: భార్యకు ఇష్టం లేని శృంగారాన్ని (మ్యారిటల్ రేప్) నేరంగా పరిగణించవలసిన అవసరం లేదని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీనికి తగిన శిక్ష విధించేందుకు ఇతర చట్టాలు ఉన్నాయని చెప్పింది. మ్యారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించే అధికార పరిధి సుప్రీంకోర్టుకు లేదని స్పష్టం చేసింది. మ్యారిటల్ రేప్ అనేది చట్టపరమైన సమస్య కన్నా ఎక్కువగా సాంఘికపరమైనదని వివరించింది. దీని ప్రభావం నేరుగా సమాజంపై ఉంటుందని చెప్పింది. సంబంధితులందరితోనూ సంప్రదించకుండా కానీ, అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కానీ మ్యారిటల్ రేప్‌పై నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని తెలిపింది. వివాహం అనేది మహిళ ఇష్టానికి చెల్లుచీటీ రాయదనే విషయంతో కేంద్ర ప్రభుత్వం ఏకీభవించింది. మహిళ ఇష్టాన్ని పురుషుడు ఉల్లంఘించినట్లయితే, అందుకు దండన ఉండాలని తెలిపింది. వైవాహిక బంధంలో ఉన్నవారి మధ్య ఇటువంటి ఉల్లంఘనలకు, అటువంటి బంధం లేనివారి మధ్య ఉల్లంఘనలకు తేడా ఉందని వివరించింది. దాంపత్యంలో భర్త నుంచి భార్య, భార్య నుంచి భర్త నిరంతరం సరైన లైంగిక సంబంధాలను ఆశిస్తారని, అటువంటి ఆకాంక్షలు భార్య ఇష్టానికి వ్యతిరేకంగా లైంగిక కార్యకలాపాలకు అంగీకారం తెలపాలని భార్యను బలవంతపెట్టే హక్కును భర్తకు ఇవ్వబోవని తెలిపింది. అత్యాచార నిరోధక చట్టాల ప్రకారం అటువంటి భర్తను శిక్షించడం మితిమీరినది, అవసరానికి మించినది అవుతుందని చెప్పింది. వివాహిత మహిళల ప్రయోజనాలను పరిరక్షించే చట్టాలను పార్లమెంటు చేసిందని తెలిపింది. గృహ హింస నిరోధక చట్టం వంటివి అమలవుతున్నాయని చెప్పింది. భార్యాభర్తల మధ్య బాంధవ్యంలో ఉండే అనేక అంశాల్లో శృంగారం ఒకటి అని కేంద్రం తెలిపింది. భారత దేశ సాంఘిక, న్యాయ పద్ధతుల దృష్ట్యా వివాహ వ్యవస్థ స్వభావాన్ని పరిశీలించినపుడు, ఈ వ్యవస్థను పరిరక్షించడం ముఖ్యమని చట్టసభలు అభిప్రాయపడితే, ఆ మినహాయింపును రద్దు చేయడం కోర్టుకు సరైనది కాదని స్పష్టం చేసింది.

## ముడా కేసులో ఆధారాల ధ్వంసానికి యత్నం

**సిద్ధరామయ్యను వెంటనే అరెస్ట్ చేయండి**

**ఈడీకి ఫిర్యాదు**

బెంగళూరు, అక్టోబర్ 3: ముడా భూ కుంభకోణంలో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మరికొందరు ఆధారాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, కేసు ఫిర్యాదుదారులలో ఒకరైన ప్రదీప్ కుమార్ ఎస్పీ ఆరోపించారు. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కేసులో నిందితుడు సిద్ధరామయ్యను వెంటనే అరెస్ట్ చేయాలని, లేకపోతే ఆధారాలను ధ్వంసం చేయవచ్చునని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ముడా కమిషనర్‌పై కూడా చర్య తీసుకోవాలని ఆయన కోరారు.

## ఢిల్లీలో 5 వేల కోట్ల డ్రగ్స్ వెనుక కాంగ్రెస్ నేత!

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: ఢిల్లీలో బుధవారం పట్టుబడిన రూ.5,600 కోట్ల డ్రగ్స్ వెనుక ప్రధాన సూత్రధారి అయిన తుషార్ గోయల్ కాంగ్రెస్ నేత అని, ఆయన ఢిల్లీ పీసీసీ ఆర్టీఐ సెల్ మాజీ చైర్మన్ అని పోలీస్ వర్గాలు తెలిపాయి. 'రాహుల్ ప్రేమ దుకాణంలో ఇప్పటివరకు విద్వేషమే లభించేది. ఇప్పుడు మాదకద్రవ్యాలు కూడా దొరుకుతున్నాయి' అని బీజేపీ విమర్శించింది. ఈ ప్రచారాన్ని కాంగ్రెస్ ఎక్స్‌లో ఖండిస్తూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు తుషార్‌ను 2022 అక్టోబర్ లోనే పార్టీ నుంచి తొలగించినట్టు పేర్కొన్నది.

## 'సావర్కర్ బీఫ్ తినేవారు'

బెంగళూరు, అక్టోబర్ 3: కర్ణాటక కాంగ్రెస్ నేత, ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు హిందుత్వవాది సావర్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన మాంసాహారి అని, గోవధను వ్యతిరేకించ లేదంటూ పేర్కొన్నారు. ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ సావర్కర్ స్వతాహగా బ్రాహ్మణుడు అయినప్పటికీ ఆయన సంప్రదాయ ఆహార అలవాట్లకు కట్టుబడి లేరని, గొడ్డు మాంసాన్ని కూడా భుజించేవారని తెలిపారు.

## కేక్‌లలో క్యాన్సర్ కారకాలు!

- బెంగళూరులో 12 శాంపిళ్లలో గుర్తింపు
- ప్రజలను అప్రమత్తం చేసిన ప్రభుత్వం



బెంగళూరు, అక్టోబర్ 3: బెంగళూరులో 12 కేక్ శాంపిళ్లలో క్యాన్సర్ కారకాలను గుర్తించినట్టు కర్ణాటక ఆహార భద్రత, నాణ్యత విభాగం ప్రకటించింది. మొత్తం 235 శాంపిళ్లను సేకరించగా అందులో 12 కేక్‌లలో కృత్రిమ రంగులు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించామని తెలిపింది. ప్రజాదరణ పొందిన రెడ్ వెల్వెట్, బ్లాక్ ఫారెస్ట్ లాంటి కేక్‌లలో తరచూ ఈ కృత్రిమ రంగులను కలుపుతున్నారని.. వీటి వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రజలను హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అల్లూరా రెడ్, సన్‌సెట్ యెల్లో ఏసీఎఫ్, పొన్‌సియూ 4ఆర్, టార్ట్రాజైన్, కెర్మోసైన్ తదితర కృత్రిమ రంగుల వాడకంలో భద్రత ప్రమాణాలను పాటించాలని బేకరీలను ప్రభుత్వం ఆదేశించింది. కృత్రిమ రంగుల వాడకం క్యాన్సర్ కారకంగా పని చేయడమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నదని కర్ణాటక ఆహార భద్రత, నాణ్యత విభాగం తెలిపింది.

**మద్యపానంతో ఆరు రకాల క్యాన్సర్లు**

మద్యం సేవించటం వల్ల ఆరు రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉన్నదని శాస్త్రవేత్తలు గుర్తించారు. హెడ్ అండ్ నెక్ క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, కాలేయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, పేగు క్యాన్సర్, ఉదర క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని అమెరికన్ అసోసియేషన్ ఫర్ క్యాన్సర్ రిసెర్చ్ పరిశోధకులు వెల్లడించారు. మద్యపానం వల్ల మన డీఎన్ఏ కూడా దెబ్బతినే చాన్స్ ఉన్నదని తెలిపారు. 2019 డాటా ప్రకారం ప్రతి 20 మందిలో ఒకరు మద్యం సేవించటం వల్ల క్యాన్సర్ బారిన పడ్డవారేనని వివరించారు. క్యాన్సర్ పెరగటానికి అనేక కారణాలు దోహదం చేస్తాయని స్పష్టంచేశారు.

## రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్

**11.72 లక్షల మందికి లబ్ధి**

న్యూఢిల్లీ: రైల్వే ఉద్యోగులకు కేంద్రం శుభవార్త చెప్పింది. పండుగల నేపథ్యంలో బోనస్ చెల్లించేందుకు నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 11.72 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు 78 రోజుల ఉత్పాదక అనుసంధానిత బోనస్ చెల్లించనున్నట్టు తెలిపింది. ఇందుకు రూ.2028.57 కోట్లు వెచ్చించనున్నట్టు వెల్లడించింది. లోకో పైలెట్లు, గార్డులు, టెక్నీషియన్ హెల్పర్స్ వంటి నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు చెల్లించే ఈ బోనస్ కింద ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 లభిస్తుంది. కాగా, ఈ ఉత్పాదక అనుసంధానిత బోనస్ ఆరో వేతన కమిషన్ సిఫార్సులకు బదులుగా ఏడో వేతన కమిషన్‌ను బట్టి ఇవ్వాలని రైల్వే సంఘాలు గురువారం సామాజిక మాధ్యమంలో ప్రచారాన్ని ప్రారంభించాయి.

## చెన్నై మెట్రో ఫేజ్-2కు ఆమోదం

**63,246 కోట్లతో 118.9 కి.మీ నిర్మాణం**

- మరో ఐదు భాషలకు ప్రాచీన హోదా
- మరాఠీ, బెంగాలీ, పాళి, ప్రాకృతం, అస్సామీ భాషలకు అరుదైన గుర్తింపు
- రెండు సాగు పథకాలకు ఆమోదం
- కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు




న్యూఢిల్లీ, అక్టోబర్ 3: చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు ఫేజ్-2లో భాగంగా మూడు కారిడార్ (నడవా)లు నిర్మించే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ నేతృత్వంలో గురువారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వీటిని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. అందులో భాగంగా చెన్నైలో రవాణా సౌకర్యం మరింత మెరుగుకు మూడు కారిడార్లు నిర్మించాలని నిర్ణయించింది. మొత్తం 118.9 కి.మీ పొడవున నిర్మించే ఈ కారిడార్లలో 128 మెట్రో స్టేషన్లు ఉంటాయి. 63,246 కోట్లతో 2027నాటికి వీటిని పూర్తి చేస్తారు. ఈ ఫేజ్-2 మెట్రో పూర్తయితే చెన్నై నగరానికి మొత్తం 173 కి.మీ మెట్రో సౌకర్యం కలుగుతుంది.

**11కు చేరిన ప్రాచీన భాషలు**

దేశంలోని మరో ఐదు భాషలకు ప్రాచీన హోదా లభించింది. మరాఠీ, బెంగాలీ, పాళి, ప్రాకృతం, అస్సామీ భాషలకు 'శాస్త్రీయ భాష' హోదా కల్పిస్తూ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో ప్రాచీన హోదా లభించిన భాషల సంఖ్య ఆరు నుంచి 11కు పెరిగింది. అంతకుముందు తెలుగు, తమిళం, సంస్కృతం, కన్నడ, మలయాళం, ఒడియా భాషలకు మాత్రమే ఈ హోదా ఉండేది.

**రెండు సాగు పథకాలకు రూ.లక్ష కోట్లు**

దేశంలోని అన్నదాతల కోసం రెండు పథకాలను గురువారం కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. రూ. లక్ష కోట్లతో సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రత లక్ష్యాలతో పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజన పథకాలకు 1,01,321.61 కోట్లను విడుదల చేయాలని కేంద్రం నిర్ణయించింది. అలాగే వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి 'వంట నూనెలు-నూనె గింజలు' మిషన్ కోసం రూ.10,103 కోట్లను కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు మన దేశీయ అవసరాలు తీర్చేందుకు 50 శాతం పైగా దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. రానున్న ఏడేండ్లలో నూనె గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.